చందు సోంబాబు

# కథనరంగం

## నా పేరు చింతామణి!

వెంకటగిరి దొరసానిలా, మాజీవీదు రసంలా, రాజమండ్రి మెరకవీధి సొగసులా, బందరు పాతరామన్న పేట రంగసాని నీలమణిలా నిగనిగలాడిపోతూ, పెటపెటలాడిపోతూ దోర జామకాయలా వుంటుంది పెద్దాపురం చింతామణి. చింతామణి చిన్నసైజు రచయిత్రి. వాక్చాతుర్యంతో పాటు, జాణతనం కూడా ఆమెకి వుంది.

తన మాటలతో ఎదుటి వాళ్లని ఆకట్టుకొని, తన పనులు చేయించుకోవ డంలో సిద్ధహస్తురాలు చింతామణి. చింతామణి తల్లి మాజీ రచయిత్రి పెద్దాపురం సోదామిని. జనం మీద తన రచనల్తో దండెత్తిన సోదామిని, జనం ఆమెని రచనలు మానమని తిరగబడి దండెత్తేసరికి రాయడం మానేసింది.

చింతామణి భర్త పి.కె.టి.రావు. అతను అల్ప సంతోషి. భార్యకి పేరొస్తే సంతోషించే దొడ్డగుణం గలవాడు.

చింతామణిని చూసి లొట్టలేసే రచయితలు కొందరు, పబ్లిషర్లు కొందరు ఆమెకి చిరుకానుకలు సమర్పిస్తుంటారు.

"అసలు నాకు అందరితో ఇలా మాట్లాడ్డం ఇష్టం వుండదు. మీకే నేనిలా అవకాశం ఇచ్చాను" అనేది చింతామణి పబ్లిషర్ బుచ్చిలింగంతో గారాలుపోతూ.

"పోనీలెండి, నన్ను అందరితోనూ జమకట్టలేదు. అదే పదివేలు", అన్నాడు బుచ్చిలింగం.

"అన్నీ కబుర్లే. అసలు నా కోసం మీరేం చేశారని? ఒక పుస్తకం అన్నా వేశారా?"

"అయ్యో, అయ్యో, అమ్మో, అమ్మో! నేను నీతో (ఏక వచనంలో కొచ్చాడు) రాయించాలనేకదా ఇట్టా నచ్చింది"

"మీరామాట ఎప్పుడూ చెప్పలేదే?"

"ఏమిటో నీ ముందుకొచ్చేసరికి అన్నీ మరచిపోతాను. అయినా న యముండగానే సంపాదించాలి!" అన్నాడు.

"నయమా?"

"అదే... అదే... గ్లామరు. నువ్వు రాస్తే ప్రతి మూడు నెల్లకు ఓ పుస్తకం వేస్తాను. ప్రతి పుస్తకానికీ నీకు మూడు వేలిస్తాను!"

"మీరు చేస్తానంటే నేను కాదన లేదుగా" అలవోకగా చూసింది చింతామణి.

"ఓ కారు, సొంతిల్లు... అన్నీ... నీవు ఏర్పరచుకోవాలి" చెప్పాడు.

చింతామణి పొంగిపోయింది.

"కూర్చోండి. కాఫీ తెస్తాను" లేచి లోపలికి వెళ్ళింది. ఆమె వెనకే నసుపుగా నడిచాడు బుచ్చిలింగం.

"నాకు హైదరాబాద్ న చ్చినప్పుడెంతో బోరుగా వుంటుంది. నువ్వు నాకు కంపెనీ ఇవ్వకూడదా!" అడిగాడు.



"దానికేం భాగ్యంలెండి", బుచ్చిలింగం వెనకనుంచి ఆమె నడుంచుట్టూ చేతులు వేశాడు.

"అబ్బ! ఏమిటది? ముందు పుస్తకాలు వెయ్యండి".

"ఇది కూడా వెయ్యనీ" నవ్వేడు.

"నాకిలాంటివి అలవాటు లేదు. మా ఆయన పి.కె.టి.రావు చెడ్డమంచోడు (భాష) కాని మిమ్మల్ని నిరాశ పరచలేకపోతున్నాను. ముందు ఎగ్రిమెంటు రాసివ్వండి".

"కాగితం, కలం వ్రటా!" అన్నాడు ఆవేశంగా.

అగ్రిమెంటు పూర్తయింది.

* * *

"మీ 'చెంబులో రాళ్లు' గురించి ఓ ప్రొడ్యూసర్‌కి చెప్పాను" అన్నాడు రచయిత పిట్టల సుబ్బారావు.

చింతామణి మొహం వెలిగిపోయింది.

"అన్నీ కబుర్లే. ఒక సబ్జక్టు చెప్పమంటే చెప్పరు. మీరు 'బుద్ధిశ్రీ' పత్రిక్కి రాసే నవల నేను రాసిస్తాను".

"దానికేం భాగ్యం. నీకు వెయ్యి నొప్పిపెడుతుంది. నేనే రాసిచ్చేస్తాను! పిట్టల సుబ్బారావు చెప్పాడు.

"ప్రామిస్",

"ప్రామిస్", చేతిలో చెయ్యివేశాడు.

ఆ చేతిని కాస్సేపు నవరదీశాడు. "నామూడ్ ఈమధ్య సరిగా లేదు చింతాలూ! మా ఆవిడకి కాన్పొస్తే యుటిరస్ తీసేశారు. నాకు సంసారసుఖం బొత్తిగా లేకుండాపోయింది".

"మరేం చేస్తున్నారు?"

"ఏం చేస్తాను. నాకు బయట టిఫిన్లు, భోజనాలు అలవాటు లేవు. నిన్నడిగి చిన్న కల్చరల్ ప్రోగ్రాం..."

"ఛీ పొదు. నాకసలే రోత. అదీకాక పి.కె.టి.రావు చాలా మంచివాడు. ఆయనకి నా మీద ఎంతో నమ్మకం పాపం".

"నువ్వంటే పిచ్చి నాకు. నా సబ్జక్ట్ నీదే. నేను రాస్తే పదివేలొస్తాయి నవలకి. దీన్ని నీకోసం త్యాగం చేస్తాను. నీ మీద మోజాకొద్దీ అడుగుతున్నానే కానీ ఆ పదివేలు పడేస్తే ఏ సినిమా స్టారో దొరక్కకాదు".

నిజంగా నేనంటే అంత ఇష్టమా!" అడిగింది.

"నవల మీదొట్టు. అడపాదడపా చిన్నచిన్న కల్చరల్ ప్రోగ్రామ్స్ పెట్టుకుందాం. మా మామయ్య చెప్పేవాడు అప్పుడప్పుడు మీ అమ్మ సోదామిని కూడా ఒకసైడ్ వర్క్ చేసేదని",

"నేనూ అనుకున్నాను. మీకో అవ కాశం ఇవ్వాలని" అంది నవ్వుతూ చింతామణి.

పిట్టల సుబ్బారావు రాయబోయే 'నక్క తోక' నవల ఆమె సొంతమైంది.

* * *

భార్య గురించి వినిపిస్తున్న పుకార్లు విని కక్కలేక మింగలేక ఛస్తున్నాడు పి.కె.టి.రావు. అది ఎలా తేల్చుకోవాలో అతనికి తెలియడం లేదు. ఆఖరికి ఓ ప్లాను వేశాడు. ఏకాంతంగా ఉన్నప్పుడు ఆమె తొడపైన బాతు బొమ్మని వేశాడు.

"ఏమిటే పని?" చిరాగ్గా అడిగింది.

"బాతు" చెప్పాడు.

"అన్నీ పిచ్చిపనులు", అంది అతన్ని ముద్దుపెట్టుకొంటూ చింతామణి. అదెందుకు గీశాడో ఆమెకి అర్థం అయిపోయింది.

* * *

ఆ రాత్రి పి.కె.టి.రావు తను గీసిన బాతు బొమ్మని చూసి ఆశ్చర్యపోయాడు. ఎడంవైపు వేసిన బొమ్మ కుడివైపుకి వచ్చింది.

"ఇది ఇటెలా వచ్చింది?" అడిగాడు.

"భలేవారే. బాతన్న తర్వాత అటూ ఇటూ తిరగకుండా ఎలా వుంటుంది. షికారుగా ఇటొచ్చి వుంటుంది" చెప్పింది చింతామణి.

అంతే!

పి.కె.టి.రావుకి స్పృహతప్పింది.